క్లుప్తంగా

కుంకుమ పూజలు



కుంకుమపూజల్లో పాల్గొన్న మహిళలు

రాజాం సిటీ: స్థానిక వాసవీకన్యాకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా వాసవీక్లబ్ మనరాజాం–సారథి, లలితాకాంతికిట్టి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పూజల్లో 120 మంది భక్తులు పాల్గొని విశేష పూజలు కుంకుమార్చనలు చేపట్టారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



అయ్యప్పస్వామి ఆలయం

రేగిడి: మండలంలో అంబఖండి గ్రామంలో నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్టా కార్యక్రమాలు సోమవారం నుంచి మూడురోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ ఆదివారం వెల్లడించింది. ఇక్కడ పుట్టలో అయ్యప్పస్వామి వెలిశాడని అంబఖండితో పాటు పరిసర గ్రామాల ప్రజలు విశ్వసిస్తారు. నిత్యం ఇక్కడ పూజలు చేస్తుంటారు. భక్తుల సహకారంతో రూ.1 కోటి విరాళాలు సేకరించి ఆలయాన్ని నిర్మించారు.

జేఈఈలో కొమెర విద్యార్థి ప్రతిభ



పాడి పార్థవనాయుడు

రేగిడి: మండలంలో కొమెర గ్రామానికి చెందిన పాడి పార్థివనాయుడు జేఈఈ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. ఆల్ఇండియా కేటగిరిలో 5328, ఓబీసీ కోటాలో 1088వ ర్యాంకు సాధించాడు. పార్థివనాయుడు జేఈఈలో ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు హేమ, మురళీమోహన్‌తో పాటు స్థానిక సర్పంచ్ పాడి లక్ష్మునాయుడు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

చలివేంద్రం ప్రారంభం



చక్కెర కర్మాగారం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రం

రేగిడి: సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం వద్ద ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. మెయిన్ గేట్ వద్ద ప్రయాణికులు, ఫ్యాక్టరీ వర్కర్ల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటుచేశామని సీనియర్ అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎ.నాగిశేషారెడ్డి, కేన్ డీజీఎం రమేష్‌రెడ్డి, కేన్ ఏజీఎం కె.అప్పారావు తెలిపారు. వేసవి పూర్తయ్యే వరకు ప్రతిరోజు చల్లని తాగునీరు అందుబాటులో ఉంచుతామన్నారు.

రైతుల సమక్షంలో హద్దురాళ్ల ఏర్పాటు



సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి

రేగిడి: సర్వే చేసిన భూముల్లో రైతుల సమక్షంలో హద్దురాళ్ల ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి అన్నారు. మండలంలో జోడిబందల గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న సర్వేరాళ్లను ఆదివారం ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. భవిష్యత్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీఆర్‌ఓలు, సర్వేయర్లు, వీఆర్‌ఏలు బాధ్యతగా పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్నారు. డీటీ డబ్బీరు శ్రీనివాసరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

డీఎస్సీ–1998 అభ్యర్థులకు ఉద్యోగాలివ్వడంపై హర్షం



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు జోగినాయుడు

బాడంగి: డీఎస్సీ–1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ప్రభుత్వం ఉద్యోగాలివ్వడంపై ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన 2019 ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని 4,027 మంది డీఎస్సీ అభ్యర్థులను ఉద్యోగాల్లోకి తీసుకోవడం సాహసోపేత నిర్ణయమన్నారు. ఉద్యోగాలు పొందిన వారంతా ముఖ్యమంత్రికి కృతజ్ఞులై ఉన్నారన్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు



పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు

- కలుపు, చీడపీడల నివారణకు దోహదం
- నేల గుల్లబారి, నీటిని పట్టి ఉంచేలా రూపాంతరం
- భూసారం మెరుగు

రాజాం సిటీ: ప్రస్తుతం పంటపొలాలన్నీ ఖాళీగా ఉండడంతో రైతులు వేసవి దుక్కులు చేపడితే అనేక ప్రయోజనాలు ఉన్నాయి. భూమి సారవంతం కావడంతోపాటు సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుంది. కలుపు, చీడపీడలు నివారించేందుకు దోహదపడుతుంది. పంటల సాగు పూర్తయిన తరువాత అలాగే వదిలేస్తే భూమిలోని సారం దెబ్బతిని తరువాత వేసే పంటలపై ప్రభావం చూపుతుంది.

కలుపు మొక్కల నివారణ

పంటలు సాగు చేయకుండా పొలాన్ని అలా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగిపోయి భూసారం తగ్గిపోతుంది. చీడపీడలకు ఆశ్రయం కలుగుతుంది. వేసవిలో లోతైన దుక్కులు దున్నడం వల్ల కలుపు మొక్కలను, పంట తెగుళ్లకు కారణమయ్యే శిలీంధ్రాలను నివారించవచ్చు. పంటకాలం ముగిశాక భూములను ఖాళీగా ఉంచడం వల్ల పంటలను ఆశించే చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. దుక్కులు చేయడం వల్ల వేరుశనగ, పత్తి, కంది, చెరకు పంటలకు ఆశించే లద్దెపురుగు, బొంతపురుగు, పుచ్చపురుగు తదితర పురుగుల గుడ్లు భూమి పొరల్లో నుంచి బయటకు వచ్చి చనిపోతాయి. అలాగే బయటపడిన గుడ్లను పక్షులు, కొంగలు తినడం ద్వారా పంటలకు చీడ పురుగుల బాధ తప్పుతుంది.

వర్షాకాలానికి ముందే దుక్కులు చేయాలి

వర్షాకాలం రాకముందే భూమిని మూడుసార్లు దుక్కి చేయాలి. ఇలా చేయడం వల్ల తొలకరి వర్షాలకు నేల మెత్తబడి నీళ్లు భూమిలోకి ఇంకుతాయి. దుక్కులు లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నడం వలన వర్షపునీరు భూమిలోకి ఇంకి తేమను నిల్వచేసే అవకాశం ఉంటుంది. దుక్కిచేసి భూమిని ఎండబెట్టడం ద్వారా కలుపుమొక్కలను నివారించవచ్చు. దుక్కులు చేసే ముందు పశువుల పేడ, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టి వేసుకుంటే భూమి మరింత సారవంతం అవుతుంది. తద్వారా తేమ నిల్వచేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. భూముల్లో దుక్కులు చేయకుండా అలాగే వదిలేస్తే పొరలు గట్టిపడిపోతాయి. పంటలు వేసిన సమయంలో పోషకాలు సరిగా అందక మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుంది. భూమి లోతుగా దుక్కి చేయడం ద్వారా నీటినిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాములు వృద్ధి చెందుతాయి.

భూసారం పెంపు ఇలా..

భూసారాన్ని పెంచుకోవడానికి రైతులు కనీసం రెండు పంటలు వేసిన తరువాత పచ్చిరొట్ట సాగుచేపట్టాలి. దీని వల్ల భూసారం పెరగడమే కాకుండా చీడపీడల బెడదతప్పి దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి. సేంద్రియ పదార్థాలను నేలకు అందించడం, కలుపు మొక్కలను నివారించడం, నేలలో నివశించే జీవరాశులకు ఆహారంగా మొక్కలకు కావాల్సిన అన్ని పోషక పదార్థాలను అందించే సాధనాలుగా ఈ పచ్చిరొట్ట పంటలు ఉపయోగపడతాయి.

నేల సారవంతం అవుతుంది



భూమిని 25 నుంచి 30 సెంటీమీటర్ల లోతు వరకు దుక్కులు చేయడం వల్ల నేలలో గాలి లభ్యత పెరిగి సూక్ష్మజీవుల సాంద్రత పెరుగుతుంది. కర్బన పదార్థాల లభ్యత పెరిగి నేల సారవంతం అవుతుంది. భూమికి వాలుగా దుక్కులు చేయడంతో వర్షం కురిసినప్పుడు నీరు భూమిలోపలకు ఇంకుతుంది. భూమికి నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. వాతావరణంలోని నత్రజని వర్షపునీటితో కలిసి నేలకు చేరడంతో సారవంతంగా మారుతుంది.

– ఎం.రేణుకాసాయి, వ్యవసాయాధికారి, రాజాం

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పిల్లల చదువును ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రంథాలయాల్లో ప్రతీ ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. గ్రంథాలయాల్లో చిల్డ్రన్స్ క్లబ్‌లు ఏర్పాటు చేసి, వారితో కథలు చదివించడం, రాయించడం, చెప్పించడం, ఇతిహాస గ్రంథాలు చదివించడం, చిత్రలేఖనం వంటివి నేర్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

దళిత పోరాట కథే ‘1818 దీర్ఘకవిత’



మాట్లాడుతున్న పిల్లా తిరుపతిరావు

రాజాం సిటీ: 1818 సంవత్సరంలో మహారాష్ట్రలోని దళితులు అప్పటి పీష్వాలపై పోరాటంచేసి గెలిచిన కథే ‘1818 దీర్ఘ కవిత’ అని ప్రముఖ సాహితీవేత్త, రచయిత పిల్లా తిరుపతిరావు అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం రాజాం రచయితల వేదిక 99వ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పుప్పాల శ్రీరామ్ రచించిన ‘1818 దీర్ఘకవిత–పరిశీలన’ అనే అంశంపై తిరుపతిరావు ప్రసంగించారు. ఆధిపత్య వర్గాలకు చెందిన పీష్వాలు తమను అణచివేస్తున్నందున దళితులు భీమానది ఒడ్డున కోరెగావ్ ప్రాంతంలో ఎదిరించి ఓడించిన కథ అని, దీనిని 73 పుటల దీర్ఘకవితగా శ్రీరామ్ రచించారని అన్నారు. ఒకే కథకు చెందిన పెద్ద కవిత అయినప్పటికీ కవితాత్మకంగా, ఆకర్షణీయంగా, చరిత్రకు అనుగుణంగా రచించారని వివరించారు. ఈ సందర్భంగా తిరుపతిరావును వేదిక సభ్యులు సత్కరించారు. సాహితీవేత్త నల్ల రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వేదిక నిర్వాహకులు గార రంగనాథం, ఒమ్మి రమణమూర్తి, పెంకి దయానిధినాయుడు, రాంబారికి రవితేజ, ఆల్తి మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

సమాజమే శ్రీశ్రీ కవితా వస్తువు



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రరవే సభ్యులు

రాజాం సిటీ: సమకాలీన సమాజాన్ని మహాకవి శ్రీశ్రీ తన కవితలకు వస్తువుగా మలిచారని రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం అన్నారు. ఆదివారం శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు కార్మిక, కర్షకుల జీవితాలను ఎంతగానో ప్రభావితం చేశాయని, సమాజాన్ని చైతన్యం చేసేందుకు ఎంతగానో దోహదం చేశాయన్నారు. కార్యక్రమంలో పిల్లా తిరుపతిరావు, నల్ల రవికుమార్, ఒమ్మి రమణమూర్తి, ఆల్తి మోహనరావు, ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ పాల్గొన్నారు.

పీఎంశ్రీ పథకానికి కంచరాం హైస్కూల్



కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

రాజాం: ప్రధానమంత్రి శ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా) పథకానికి మండలంలో కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైందని ఎంఈఓ పొండ్రంకి నాగయ్య ఆదివారం తెలిపారు. జిల్లాలో 24 జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలు ఈ పథకానికి ఎంపిక కాగా, రాజాం మండలం నుంచి కంచరాం పాఠశాల ఎంపికైందన్నారు. ఈ పథకం కింద రానున్న మూడేళ్లలో రూ.46 లక్షల నిధులను విడతల వారీగా ఈ పాఠశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతంతో మంజూరుచేస్తాయన్నారు. పూర్తిస్థాయిలో డిజిటల్ బోధనకు ఈ పథకం వర్తిస్తుందన్నారు.

సీఎం జగన్ బాగుండాలని ప్రార్థనలు



ఒడిశాలోని నారాయణపట్నం దర్గాలో సీఎం వైఎస్ జగన్ బ్యానర్‌తో ముస్లిం సోదరులు

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాగుండాలని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్ ఒడిశాలోని నారాయణపట్నం దర్గాలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సెహెరెలిబాబా గంధ మహోత్సవం సందర్భంగా అక్కడి దర్గాను సందర్శించిన ఆయన వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి రావాలని, సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అల్లాహ్‌ను వేడుకున్నారు.

ఘనంగా దాడితల్లి అమ్మవారి ఉత్సవాలు



ఆకట్టుకున్న అమ్మవారి వేషధారణలు

బొబ్బిలి: స్థానిక గొల్లపల్లిలో దాడితల్లి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి పోటెత్తిన భక్తులు ఈ ఏడాది అంతా పంటలు బాగా పండాలని, అందరూ బాగుండాలని అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం ఉయ్యాల కంబాల ఉత్సవం అత్యంత వైభవంగా చేశారు. ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు తెంటువలసలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

బాడంగి: మండలంలోని తెంటువలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ పెద్దింటి రామారావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



హెచ్‌ఎంకు మైక్‌లను అందిస్తున్న పూర్వవిద్యార్థులు

సంతకవిటి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, నాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ సందడిగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు లావేటి రమణయ్య, పొట్నూరు బాలకృష్ణ, బి.గౌరిశాస్త్రి, జోగిశాస్త్రి, వావిలపల్లి విశ్వేశ్వరరావు, రామ్మోహన్‌లతో పాటు ప్రస్తుత హెచ్‌ఎం రవిశంకర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రూ.50 వేలు విలువచేసే రెండు లౌడ్ స్పీకర్లు, ఒక యాంప్లిఫైయర్, రెండు వైర్‌లెస్ మైక్‌లను హెచ్‌ఎంకు అందించారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి



శ్రీశ్రీ చిత్రపటాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాజాం: పట్టణంలో కొత్తవలస యూపీ స్కూల్ వద్ద శ్రీశ్రీ జయంతి కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. హెచ్‌ఎం కుదమ తిరుమలరావు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీశ్రీ రచనలను విద్యార్థులకు వివరించారు. అరసం అధ్యక్షునిగా, విరసం వ్యవస్థాపకునిగా శ్రీశ్రీ విప్లవశంఖం పూరించారన్నారు. అభ్యుదయ కవిగా, విప్లవకవిగా జగన్నాథుని రథచక్రాలు వలే దూసుకెళ్లిన శ్రీశ్రీ జీవితశైలి ఎంతోమందికి ఆదర్శమని అన్నారు. క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. శ్రీశ్రీ చిత్రపటాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: తెర్లాం మండలంలోని పూనువలస గ్రామ పంచాయతీ, చినపాలవలస గ్రామానికి చెందిన 20 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పక్కి గ్రామంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పార్టీ కండువాలు వేసి, సాదర స్వాగతం పలికారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వారిని కోరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఉప సర్పంచ్ గులిపల్లి కృష్ణమూర్తి, సత్యంనాయుడు, కలమట రాములు, కోడూరు పకీరు, కలివరపు దాలమ్మ, దండాసి బంగారమ్మ, బొబ్బిలి సింహాచలం, కొయ్యాన పృథ్వీ, రాగోలు చినఎరుకులు, లోచర్ల సూరమ్మ, గొండేల బాగయ్య, తిర్లంగి నరసయ్య, అప్పయ్య, పక్కి ఉష, పూతి సూర్యనారాయణ ఉన్నారు. కార్యక్రమంలో తెర్లాం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నర్సుపల్లి బాబ్జీరావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేత



లబ్ధిదారునికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: మండలంలో గురవాం గ్రామానికి చెందిన పున్నాన మోహనరావుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం అందజేశారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న మోహనరావు వైద్యఖర్చులకు సాయం అందించాలని ఎమ్మెల్యేను కోరగా.. ఆయన సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.1.20 లక్షలు ఆర్థిక సాయం మంజూరైంది. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారునికి అందజేశారు. ఆయనతో పాటు పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, ఆల్తి రాంబాబు, ఆల్తి సత్యనారాయణ, వంజరాపు విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పీఎంఈజీపీ యూనిట్ల పరిశీలన



డైరీఫాం ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: మండలంలో బొద్దాం, కొత్తపేట గ్రామాల్లో పీఎంఈజీపీ ద్వారా గుర్తించిన యూనిట్లును లైవ్ స్టాక్ డీపీఎం వీవీఎస్ఎన్ మూర్తి, వైకేపీ ఏసీ చిరంజీవి ఆదివారం పరిశీలించారు. లబ్ధిదారులైన సరస్వతి, మూడడ్ల లక్ష్మి, భట్న రామలక్ష్మిలతో మాట్లాడారు. యూనిట్లు చక్కగా అమలుచేసి, ఆదాయవనరులు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఫౌల్ట్రీ, డైరీ ఫామ్‌లు ఏర్పాటుకు 35 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైకేపీ ఎఫ్‌పీఓ ఏపీఎం కె.హేమలత, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

తాగి పట్టుబడితే జైలుకే..



వాహనదారుడిని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే జైలుకు పంపించడం ఖాయమని సీఐ తిరుమలరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లలో ఎస్ఐ సురేంద్రనాయుడుతో కలిసి ఆదివారం వాహన తనిఖీలు చేపట్టి, వాహనదారులు మద్యం తాగారా లేదా అని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించారు. మద్యపానం ఆరోగ్యానికి హానికరమని, మద్యం సేవించి వాహనం నడిపితే సమాజానికి అంతకంటే ప్రమాదకరమన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం ఎంత చెబుతున్నా మందుబాబులు వినడం లేదన్నారు. పెద్దల దగ్గర నుంచి యువత వరకు, చదువుకున్న వారి నుంచి చదువులేని వారి వరకు ప్రతిఒక్కరూ మద్యం సేవించి, వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎంతో మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, మరెంతో మంది దివ్యాంగులుగా మారారని వివరించారు. మద్యం తాగి వాహనాలు నడపకుండా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

‘అందరం పుస్తకాలు చదివేద్దాం’



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు

తెర్లాం: వేసవి సెలవుల్లో విద్యార్థులంతా పుస్తకాలు చదివేలా ప్రభుత్వం అమలు చేస్తున్న అందరం పుస్తకాలు చదివేద్దాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి కోరారు. అందరం పుస్తకాలు చదివేద్దాం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెరుమాళి జెడ్పీ ఉన్నత పాఠశాల లైబ్రరీలోని పుస్తకాలను విద్యార్థులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలకు అతుక్కుపోకుండా పుస్తక పఠనంపై దృష్టి సారించాలని సూచించారు. పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం కలుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి తాను తీసుకువెళ్తున్న పుస్తకాలను సకాలంలో చదివి, వాటిని మిగిలిన విద్యార్థులకు అందజేయాలన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి



గ్రామంలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్

రేగిడి: విద్యార్థుల్లో చదువుతో పాటు సామాజిక సేవ కూడా ఉండాలని జీఎంఆర్‌ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. మండలంలో మునకలవలస గ్రామంలో గత వారంరోజులుగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ సేవాశిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అలాగే విద్యార్థులకు ప్రజా సమస్యలు, సామాజిక సేవ పట్ల అవగాహన వస్తుందన్నారు. అనంతరం గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్‌రావు, అసోసియేట్ డీన్ స్టూడెంట్స్(ఎఫైర్స్) డాక్టర్ జి.శశికుమార్, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

• అమ్మో ఎండ..!



నిర్మానుష్యంగా తెర్లా ప్రధాన రోడ్డు



గొడుగు నీడలో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

తెర్లాం: వేసవి ఎండల తీవ్రత గత కొన్నిరోజులుగా విపరీతంగా పెరుగుతోంది. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉదయం 7 గంటల నుంచే ప్రారంభమవుతున్న ఎండలు క్రమేపీ తీవ్రతరమవుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే ఎండ ధాటికి తట్టుకోలేక చాలామంది ఇళ్లకు పరిమితమవుతున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావడం లేదు. ఒకవేళ వచ్చినా గొడుగు, వాటర్‌బాటిల్ తప్పనిసరిగా వెంట తీసుకువస్తున్నారు. ఆదివారం కూడా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో మండల కేంద్రంలోని ప్రధాన రోడ్లు, కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. రానున్న రోజుల్లో ఎండలు ఇంకెంత భయంకరంగా ఉంటాయోనని స్థానికులు భయపడుతున్నారు.